పొద్దున తొడిగిన అద్దాల రైకకు
మాపటికే పొగరొచ్చింది!."

హఠాత్తుగా కన్నె వయసు ఆవిర్భవించిన దశ ఆది. ఆలంకారికంగా చెబితే ఆది ప్రతిక్షణ విభ్రాంభమాణ యవ్వనమన్నమాట. నిన్న, సాయంత్రం వరకు బాలిక. తెల్లారేసరికి వయసుకత్తె పోలిక. ఇందులో కవితాపరంగా పరిశీలిస్తే అతిశయోక్తి ఉంది. ఆ పొద్దుటి మంచి సాయంకాలం కాగానే వయసుకు మరింత బిగువొచ్చింది. పొద్దున తొడిగిన అద్దాల రైకకు మాపటికే పొగరొచ్చింది అవడంలో ఆ అర్థ ధ్వని ఉంది. అలా ఉన్న విష యాన్ని బయటపెట్టిన ఆ కన్నె పడుచు అంతటితో ఆగక

"ఏమి చేయనురా- ఈ వయ
సెట్టా మోయనురా" అని ప్రాధేయపడతుంది.

ఇక్కడి బరువు శరీరానిది కాదు తరుణ యవ్వ నానిది. చరణంలో ఈ భావదీప్తి మరింతగా మెరిసిపోతుంది. అందుకు అనుగుణంగానే నాయకుడు చరణంలో తన అభిప్రాయాలను ఇలా ఎక్కు పెడతాడు.

"పైరగాలి పాడే జోలలో- నీ
పైట నన్ను పలకరించిన యేళలో
చెప్పలేని అది యేదో
చిటపటలాడింది.
పట్టుకుందమనుకుంటే
పైట చెంగే మిగిలింది."

తన పైన అంతటి మరులుగొన్న నాయకుడి మాటలు వినగానే నాయిక మనసు గింగిర్లు తిరిగిపోతుంది. మామూలుగా మరులుగొన్న నాయిక నాయకుడిపైన వాలివాలిపోతుంటే అతడు ఉడికింపు కోసం తప్పకు తప్పకు పోతుంటాడు. తనలోని కోరికేదో సూటిగా చెప్పదామనుకుంటే "సిగ్గు పగ్గ మేసింది" అంటూ ఆ మొగ్గ చెప్పకనే చెప్పేసింది తొలి చరణంలో. అది గ్రహించిన అతడు ఆవిడను పట్టుకుందామనుకుంటే 'పైట చెంగే మిగిలింది" అని రెండో చరణంలో అనేస్తాడు. వెంటనే ఆవిడ అందుకుంటుంది.- పల్లవిలోని చివరి ముక్తాయింపు పదాలను

"ఏమి చేయనురా- ఈ వయ
సెట్టా మోయనురా" అని.

ఫలానా రాగమని నిర్దేశించడానికి వీలు లేనంత ఒదువుగా పల్లె పాటల ఒరవడిలో స్వర పరిచిన ఈ గీతాన్ని సుశీల, బాలసుబ్రహ్మణ్యం మాటలకు తగ్గ మత్తులో గానం చేశారు. ఈ గీతాల పద రచనలోనూ, స్వర రచనలోనూ దర్శకుడు కృష్ణ ఉత్తమాభిరుచి దోహదం చేసిందనడం కేవలం సహజోక్తి సుమా!

☆

మినీ కథ

# ఉద్యోగం - ఉద్యోగ వ్యథ

**"బాబోయ్! ఇంత ప్రొద్దెక్కింది....ఇంత వరకు పని మనిషి రాలేదు" ఖంగారుగా అనుకుంటూ మళ్ళీ గుమ్మం వైపు చూసింది శ్యామల.**



ఈ రోజు బ్యాంక్ కెళ్ళేసరికి ఎలాగూ ఆలస్యమవుతుంది. ఆ మేనేజర్ తీక్షణ వీక్షణాల్ని ఎలా భరించాలో....అదేదో అంతర్జాతీయ సమస్యలా తోచింది. అవును మరి! ఐదు నిమిషాలు ఆలస్యమైతే చాలు అరగంట నిల బెట్టి ఉపన్యాసం దంచుతాడు. "అధికార హోదాలో ఉండి మనమే లేట్‌గా వస్తే స్టాఫ్ వేలెత్తిచూపే అవకాశముంది. వాళ్ళకు సమాధానము చెప్పుకొనే పరిస్థితి ఎందుకల్పించుకోవాలి" అంటూ.

అఫ్‌కోర్సు! ఆయన మాటల్లో అబద్ధమేమీ లేదు. కాని ప్రస్తుత సమస్య తీరేదెలా?

గేట్ చప్పుడు అవగానే ఒక్క ఉదుటన బయటకెళ్ళింది.

"యాదమ్మ!" సమయానికొచ్చావు.. పద పనిలోకి పురమాయించింది.

"అమ్మగారూ! మా చంటోడికి ఒంట్లో బాగాలేదు. జ్వరం తగిలింది" చేతులు నలుపుకుంటూ సమాధానం దీనంగా ఇస్తోంది.

ఆమె గొంతు వింటే...తను కరిగిపోతుంది...ఆ తర్వాత తన బాస్‌తోటి అక్షింతలు తప్పవు.

"యాదమ్మ! ఎండాకాలం కదా! వడ దెబ్బయి వుంటుంది. ఎంత సేపు అర గంటలో చేస్తావు పని..అంతగా అయితే ఈ రోజు బట్టలుతకవద్దు..అయినా డాక్టర్లు ఇప్పుడప్పుడే రారుకదా! ఎలాగు 10వతుంది" ఎదురుగా ఉంటే మళ్ళీ మాటలు. ఎందుకులే అని వంటింట్లోకి దారితీసింది శ్యామల.

పాపం పిల్లవాడికి బాగాలేదు. అయినా ఇక్కడిదాకా వచ్చి చెప్పవలసిన అవసరం లేదు. తను రాకపోతే ఏం చేయగలదూ అంతరాత్మ పోరుతున్నా వినిపించుకొనే సమయం లేక యాదమ్మతో అలాగే పని చేయించుకొని ఆమెని పంపించివేసింది.

* * * * *

ఆ రోజంతా ఒకటే అలసటగా ఉంది. ఉదయమే ఊరునుండి వచ్చింది. వాతావరణం వేడిగా వుండటం వలన నిద్రలేక తలంతా బరువుగా ఉంది. ఈ రోజుకూడా బ్యాంక్‌కు సెలవు పెడితే బాగు అని పించింది. మేనేజర్‌కి ఫోన్ చేసి చెపుదామని ఇంటికి ఫోన్ చేసింది.

"సార్! నేను ఇప్పుడేవచ్చాను ఊరు నుండి...ఈ రోజు రాలేను" బ్రతిమలాడుతున్నట్టుగా వుంది ఆమె గొంతు.

"ఎలా మేడమ్! బ్యాంక్‌లో నల్గురు లీవులో వున్నారు. ఈ రోజు మీరు వస్తారు కదాని నేను వాళ్ళకు లీవిచ్చాను" మీరు తప్పనిసరిగారావాలన్నట్లు ఆధికారికంగా వినిపించింది ఆయన గొంతు.

"అయితే ఏం! లీవు ఎక్స్టెటెండ్ చేయకూడదా! మనసులో అనుకుంటూ చాలా restlessగా వుంది సార్" అని చెప్పింది.

"ఫర్వాలేదు మేడమ్! ఒక గంట ఆలస్యంగా రండి స్టాఫ్ ఎంతమంది లీవులో వున్నారో మీకు చెప్పాను. ఒక్కసారి నా పరిస్థితి ఆలోచించండి" నిర్ణయం తనకే వదిలి పెట్టాడాయన.

విపరీతమైన తలనొప్పితో, నిద్రలేమితో ఊసురోమంటూ అలాగే బ్యాంక్‌కు బయలుదేరింది శ్యామల.

-వనం జానకీదేవి